ఈఎల్ఐ డెడ్‌లైన్ ఈ నెలాఖరే

న్యూఢిల్లీ, నవంబర్ 25: ఉద్యోగ భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) నుంచి ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ (ఈఎల్ఐ) పథకం ప్రయోజనాలను పొందాలంటే ఉద్యోగులు ఈ నెలాఖర్లోగా (నవంబర్ 30లోగా) తమ యూనివర్సల్ అకౌంట్ నెంబర్ (యూఏఎన్)ను యాక్టివేట్ చేసుకోవాలని, బ్యాంక్ ఖాతాతో ఆధార్‌ను అనుసంధానించుకోవాలని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఈ ఏడాది జూలైలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఈఎల్ఐ పథకాన్ని పరిచయం చేసిన విషయం తెలిసిందే. ఇక ఇందులో మూడు రకాల స్కీములు న్నాయి.

ఏ స్కీం: ఇందులో అన్ని సంఘటిత రంగాల్లో కొత్తగా ఉద్యోగంలో చేరినవారికి ఒక నెల జీతం అందిస్తారు. అయితే ఈపీఎఫ్‌వో సభ్యులై ఉండాలి.

బీ స్కీం: దీనిలో తొలి నాలుగేండ్ల ఉద్యోగ కాలంలో ఈపీఎఫ్‌వోకు చేసిన విరాళం ఆధారంగా అటు కంపెనీకి, ఇటు ఉద్యోగికి ఇద్దరికీ నిర్ణీత మొత్తంలో ప్రోత్సాహకాలు నేరుగా అందుతాయి. తయారీ రంగంలోని కొత్త ఉద్యోగులకే ఇది వర్తిస్తుంది.

సీ స్కీం: ఉద్యోగ కల్పనను పెంచడానికి దీన్ని రూపొందించారు. కొత్తగా చేర్చుకునే ప్రతీ ఉద్యోగికిగాను సంస్థకు రెండేండ్లపాటు నెలకు రూ.3,000 చొప్పున రీయింబర్స్‌మెంట్ అందిస్తారు.

ఎలా చేరాలి?

- ముందుగా https://unifiedportal-mem.epfindia.gov.in/memberinterface/కు వెళ్లాలి
- ఆ తర్వాత కుడి వైపు కింద ఉన్న 'ఇంపార్టెంట్ లింక్స్'లో ఉన్న 'యాక్టివ్ యూఏఎన్'పై క్లిక్ చేయాలి.
- అపై ఓపెన్ అయ్యే కొత్త పేజీలో యూఏఎన్ నెంబర్, ఆధార్, పుట్టినతేదీ, మొబైల్ నెంబర్ వివరాలు నమోదు చేయాలి.
- చివరగా ఆధార్‌తో అనుసంధానమైన మీ మొబైల్ ఫోన్‌కు ఓటీపీ కోసం 'గెట్ ఆథరైజేషన్ పిన్'పై క్లిక్ చేయాలి. ఆ ఓటీపీతో ప్రక్రియ పూర్తవుతుంది. పాస్‌వర్డ్ మీ మొబైల్‌కు వస్తుంది.

అదానీకి టోటల్ షాక్

కొత్త పెట్టుబడుల్లేవన్న ఫ్రెంచ్ ఇంధన దిగ్గజం • అమెరికా లంచం కేసుతో తలనొప్పి

న్యూఢిల్లీ, నవంబర్ 25: గౌతమ్ అదానీకి ఫ్రాన్స్ ఇంధన రంగ దిగ్గజ సంస్థ టోటల్‌ఎనర్జీస్ ఎస్ఈ షాకిచ్చింది. అదానీ గ్రూప్ సంస్థల్లో ఇకపై కొత్తగా పెట్టుబడులు పెట్టబోమని సోమవారం ప్రకటించింది. అదానీపై అమెరికాలో లంచం కేసు నమోదైన నేపథ్యంలోనే టోటల్ ఈ నిర్ణయం తీసుకున్నది. అదానీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తునకు సంబంధించి తమకు ఏమీ తెలియదంటున్న టోటల్‌ఎనర్జీస్.. ఆ కేసు పరిష్కారం అయ్యేంతదాకా తదుపరి పెట్టుబడుల జోలికి వెళ్లబోమని తేల్చి చెప్పేసింది.

పెద్ద ఎదురుదెబ్బే

బిలియనీర్ గౌతమ్ అదానీ నేతృత్వంలోని అదానీ గ్రూప్‌లో భారీగా పెట్టుబడులు పెడుతున్న ప్రధాన విదేశీ సంస్థాగత మదుపరులలో టోటల్‌ఎనర్జీస్ కూడా ఒకటి. ఈ క్రమంలోనే అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఏజీఈఎల్), సిటీ గ్యాస్ యూనిటైన అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ (ఏటీజీఎల్)లలో వాటాలు కూడా ఉన్నాయి. 'అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ కోసం సోలార్ పవర్ సరఫరా కాంట్రాక్టులను పొందేందుకు భారతీయ అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలను గౌతమ్ అదానీ, మరో ఇద్దరు సంస్థ ఉన్నతోద్యోగులు ఇచ్చారని అమెరికా అధికార వర్గాలు నేరారోపణలు చేసిన విషయం తెలిసింది. ఏజీఈఎల్ లేదా దాని అనుబంధ సంస్థలే లక్ష్యంగా ఈ నేరారోపణలు రాకున్నా.. కీలక వ్యక్తులు ఈ కేసులో నిందితులుగా ఉన్నందున, ఈ వ్యవహారం తేలేదాకా మరిన్ని పెట్టుబడులు అదానీ గ్రూప్ సంస్థల్లో పెట్టకూడదని నిర్ణయం తీసుకున్నాం.' అని టోటల్‌ఎనర్జీస్ స్పష్టం చేసింది.

ఆరేండ్లుగా..

అదానీ గ్రూప్, టోటల్‌ఎనర్జీస్ మధ్య అనుబంధం ఆరేండ్లుగా కొనసాగుతున్నది. ఏజీఈఎల్‌లో టోటల్‌కు 19.75 శాతం వాటా ఉన్నది. అలాగే ఏటీజీఎల్‌లో 37.4 శాతం వాటాను కొన్నది. అయితే 2018లో ఓ ఎల్ఎన్‌జీ వెంచర్ కోసం అదానీతో తొలిసారిగా టోటల్‌ఎనర్జీస్ జట్టు కట్టింది. ఆ తర్వాతే ఏజీఈఎల్, ఏటీజీఎల్‌లో వాటాలను సొంతం చేసుకున్నది. ముడిచమురు-సహజవాయువుల అన్వేషణ, ఉత్పత్తి, అమ్మకపు రంగాల్లో టోటల్‌ఎనర్జీస్ ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాల్ని సాగిస్తున్నది. అలాంటి ఈ కంపెనీ నుంచి మరిన్ని పెట్టుబడులకు బ్రేక్ పడటం అదానీ గ్రూప్‌నకు ఇబ్బందేనన్న అభిప్రాయాలు మార్కెట్ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

మళ్లీ 80 వేల పైకి సెన్సెక్స్

ఒక్క శాతానికిపైగా లాభపడిన సూచీ

314 పాయింట్లు అధికమైన నిఫ్టీ



ముంబై, నవంబర్ 25: దేశీయ స్టాక్ మార్కెట్లు రివ్వున ఎగిశాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి సంకీర్ణ ప్రభుత్వం బంపర్‌మెజార్టీతో విజయసాధించడంతో సూచీలు కదంతొక్కాయి. వీటికి తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీల్లో మరింత జోష్ పెంచింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలు ఒకదశలో రెండు శాతం వరకు లాభపడ్డాయి. క్యాపిటల్ గూడ్స్, ఎనర్జీ, బ్యాంకింగ్ రంగ షేర్లు మదుపరులను కొనుగోళ్లవైపు నడిపించాయి. ఫలితంగా ఇంట్రాడేలో 1,400 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 80 వేల పాయింట్ల మైలురాయిని మరోసారి అధిగమించింది. చివరకు 992.74 పాయింట్లు లేదా 1.25 శాతం లాభపడి 80,109.85 వద్ద నిలిచింది. 2,697 షేర్లు లాభపడగా, 1,352 సూచీలు పతనం చెందాయి. మరో సూచీ నిఫ్టీ 314.65 పాయింట్లు లేదా 1.32 శాతం ఎగబాకి 24,221.90 వద్ద స్థిరపడింది.

మిశ్రమంగా అదానీ షేర్లు

అదానీ గ్రూపునకు చెందిన షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. ఫ్రెంచ్‌నకు చెందిన టోటల్‌ఎనర్జీ..అదానీ గ్రూపులో పెట్టుబడులను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో అదానీ గ్రీన్ ఎనర్జీ షేరు ఏకంగా 8 శాతం నష్టపోయింది. దీంతోపాటు అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 3.78 శాతం నష్టపోగా, అదానీ పవర్ 3.02 శాతం, ఎన్‌డీటీవీ 2.07 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 1.43 శాతం చొప్పున నష్టపోయాయి. కానీ, అదానీ పోర్ట్స్ 2.55 శాతం అధికమవగా, ఏసీసీ 2.54 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 1.26 శాతం, అదానీ విల్మార్ 1.81 శాతం, అంబుజా సిమెంట్ స్వల్పంగా లాభపడింది.

- ఎల్అండ్‌టీ షేరు అత్యధికంగా 4.13 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది.
- ఎస్బీఐ, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, టీసీఎస్, హెచ్‌యూఎల్, యాక్సిస్ బ్యాంక్, మహీంద్రాఅండ్ మహీంద్రాలు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి.
- వీటితోపాటు ఎన్‌టీపీసీ, టాటా మోటర్స్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్, నెస్లె, సన్ ఫార్మా, ఐటీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, మారుతిలు నష్టపోయాయి.
- రంగాలవారీగా ఇండస్ట్రీయల్స్ 3.29 శాతం, క్యాపిటల్ గూడ్స్ 3.27 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 3.26 శాతం, ఎనర్జీ 2.56 శాతం, రియల్టీ 2.22 శాతం, బ్యాంకింగ్ 2.06 శాతం, ఆర్థిక సేవలు 1.89 శాతం, హెల్త్‌కేర్ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

పెరిగిన 14 లక్షల కోట్ల సంపద

స్టాక్ మార్కెట్ల భారీ లాభాలతో మదుపరులు తడిసిముద్దవుతున్నారు. గత కొన్నాళ్లుగా నష్టాలే పరమావధిగా గడిచిన సూచీలు రికార్డు స్థాయిలో లాభపడటంతో మదుపరులు సంపద లక్షల కోట్ల స్థాయిలో పెరిగింగి. గత వరుస రెండు సెషన్లలో మదుపరుల సంపద రూ.14.20 లక్షల కోట్ల మేర పెరిగింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల మార్కెట్ విలువ రూ.14,20,004.4 కోట్లు పెరిగి రూ.4,39,58,912.41 కోట్లు(5.22 ట్రిలియన్ డాలర్లు) చేరుకున్నది.

వడ్డీపై ఆదాయ పన్ను వద్దు

నిర్మాణ రంగాభివృద్ధి కోసం గృహ రుణాలపై కేంద్రాన్ని కోరుతున్న క్రెడాయ్

All you want to know about CREDAI

న్యూఢిల్లీ, నవంబర్ 25: గృహ రుణాలపై చెల్లించే వడ్డీకి పూర్తిగా ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపునివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని రియల్టర్ల సంఘం క్రెడాయ్ కోరింది. ఈ ప్రోత్సాహకం మధ్యతరగతి వర్గాల్లో ఇండ్ల కొనుగోళ్లను పెంచగలదని, అది యావత్తు నిర్మాణ రంగాభివృద్ధికి దోహదం చేయగలదని అభిప్రాయపడింది. ప్రస్తుతం గృహ రుణాలపై వార్షిక వడ్డీ చెల్లింపులు రూ.2 లక్షలదాకే ఉంటే ఐటీ చట్టంలోని సెక్షన్ 24 కింద రుణ గ్రహీతలకు ఆదాయ పన్ను మినహాయింపు లభిస్తున్నది. అది దాటితే మాత్రం వర్తిస్తున్నది. దీంతో ఈ లిమిట్‌ను తొలగించాలని క్రెడాయ్ అంటున్నది. క్రెడాయ్ ఏర్పాటై 25 ఏండ్లు పూర్తయిన నేపథ్యంలో సోమవారం దాని అధ్యక్షుడు బొమన్ ఇరానీ ఇక్కడ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగానే పైవిధంగా డిమాండ్ చేశారు.

అఫర్డబుల్ హౌజింగ్‌పై..

సరసమైన ధర (అఫర్డబుల్)ల్లో లభించే నివాసాల విలువను రూ.45 లక్షల నుంచి రూ.75-80 లక్షలకు పెంచాలని కూడా ఇరానీ డిమాండ్ చేశారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఈ శ్రేణి గృహాలపై 1 శాతం వస్తు సేవల పన్ను (జీఎస్టీ)నే వేయాలన్నారు. ప్రస్తుతం రూ.45 లక్షలలోపు ఖర్చవుతున్న ఇండ్లపై జీఎస్టీ 1 శాతంగానే ఉన్నది. ఆపై విలువ కలిగిన ఇండ్లకు 5 శాతం జీఎస్టీ పడుతున్నది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కూడా రావట్లేదని డెవలపర్లు అంటున్నారు. దీంతో అఫర్డబుల్ హౌజింగ్ నిర్వచనాన్ని సవరించాలని క్రెడాయ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది. 2017లో ఈ నిర్వచనం వచ్చింది. రూ.45 లక్షల వ్యయంతో నిర్మించే ఇండ్లను ఈ కేటగిరీలో చేర్చారు. అయితే అప్పటితో పోల్చితే ఇప్పుడు అన్నింటి ధరలు పెరిగాయని, కాబట్టి రూ.75-80 లక్షల ఖర్చుతో నిర్మించే నివాసాలన్నింటినీ అఫర్డబుల్ హౌజింగ్‌లోకే చేర్చాలని రియల్టర్లు డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల జీఎస్టీ భారం తగ్గుతుందని, ఇండ్ల కొనుగోలుదారులకు లాభిస్తుందని చెప్పున్నారు. భారతీయ రియల్ ఎస్టేట్ డెవలపర్ల సంఘ సమాఖ్య (క్రెడాయ్) 1999లో ఏర్పాటైంది. దేశవ్యాప్తంగా ఇందులో 13వేలకు పైగా సభ్యులున్నారు.

NATIONAL INSTITUTE FOR MICRO, SMALL & MEDIUM ENTERPRISES (ni-msme)
(Implementing Agency for Nizamabad Turmeric Cluster) Prakriti Environment Society,
Prakriti Plot No.89, Ground Floor, Venkateswara Enclave, Quthbullapur, Jeedimetla, Hyderabad-500067.
Mob: 9703502417. Email: prakritipes@yahoo.com Website: www.myprakriti.org

NIT No. 1/NIZAMABAD/2024 Date: 26.11.2024

NOTICE INVITING TENDER

Sealed Tenders in prescribed format in two cover system are invited by The President, Prakriti Environment Society, the Implementing Agency of Nizamabad Turmeric Cluster from the **reputed machinery manufacturers/ suppliers for supply of R&D Equipment at Common Facility Centre, Manoharabad Village, Jakranpally Mandal, Nizamabad District, Telangana under the Scheme of Fund for Regeneration of Traditional Industries (SFURTI), Ministry of MSME, Government of India.** Eligible organizations/ agencies may contact the undersigned to obtain Tender Document. Last date for submission of Tender is **16.12.2024 up to 5.00 PM.**

Sd/- President, Prakriti Environment Society.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

నెం. Y/C.ఇ-వేలం/HYB/2024-25, తేది: 18-11-2024

హైదరాబాద్ డివిజన్ కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్టులు & NFR కాంట్రాక్టుల కొరకు ఇ-వేలాన్ని అమలు చేసింది. ఆ ప్రకారం, హైదరాబాద్ డివిజన్ దిగువ తెలిపిన కేటగిరీల కొరకు ఇ-వేలం ప్రక్రియ చేపట్టింది.

క్ర. సం.	కేటగిరి	క్యాటలాగ్ నెం.	వివరాలు	వేలం తేది	వేలం ప్రారంభ సమయం	వేలం ముగింపు సమయం
1	MSS-HYB-SFX-BS-73-24-1 (వివిధ స్టాటిక్ సర్వీసులు-బ్యాటరీ మార్పిడి స్టేషన్లు)	HYB-MSS-24	సఫిల్‌గూడ వద్ద బ్యాటరీ మార్పిడి పాయింట్ స్టేషన్	30.11.24	11.00	11.30
2	MSS-HYB-RKO-BS-77-24-1 (వివిధ స్టాటిక్ సర్వీసులు-బ్యాటరీ మార్పిడి స్టేషన్లు)	HYB-MSS-24	రామకిష్టాపురం వద్ద బ్యాటరీ మార్పిడి పాయింట్ స్టేషన్	30.11.24	11.00	11.40
3	MSS-HYB-JOO-BS-78-24-1 (వివిధ స్టాటిక్ సర్వీసులు-బ్యాటరీ మార్పిడి స్టేషన్లు)	HYB-MSS-24	జమై ఉస్మానియా వద్ద బ్యాటరీ మార్పిడి పాయింట్ స్టేషన్	30.11.24	11.00	11.50
4	MSS-HYB-STPD-BS-74-24-1 (వివిధ స్టాటిక్ సర్వీసులు-బ్యాటరీ మార్పిడి స్టేషన్లు)	HYB-MSS-24	సీతాఫల్‌మండి వద్ద బ్యాటరీ మార్పిడి పాయింట్ స్టేషన్	30.11.24	11.00	12.00
5	MSS-HYB-LGDH-BS-72-24-1(వివిధ స్టాటిక్ సర్వీసులు-బ్యాటరీ మార్పిడి స్టేషన్లు)	HYB-MSS-24	లాలాగూడ హాల్ట్ వద్ద బ్యాటరీ మార్పిడి పాయింట్ స్టేషన్	30.11.24	11.00	12.10
6	MSS-HYB-VAR-BS-75-24-1 (వివిధ స్టాటిక్ సర్వీసులు-బ్యాటరీ మార్పిడి స్టేషన్లు)	HYB-MSS-24	విద్యానగర్ వద్ద బ్యాటరీ మార్పిడి పాయింట్ స్టేషన్	30.11.24	11.00	12.20
7	MSS-HYB-ALW-BS-76-24-1 (వివిధ స్టాటిక్ సర్వీసులు-బ్యాటరీ మార్పిడి స్టేషన్లు)	HYB-MSS-24	అల్వాల్ వద్ద బ్యాటరీ మార్పిడి పాయింట్ స్టేషన్	30.11.24	11.00	12.30
8	MSS-HYB-SFX-GZ-71-24-1 (వివిధ స్టాటిక్ సర్వీసులు-గేమింగ్ జోన్)	HYB-MSS-24	గేమింగ్ జోన్ యొక్క ఏర్పాటు (బాక్స్ క్రికెట్)	30.11.24	11.00	12.40
9	MSS-HYB-KCG-PS-52-24-1 (వివిధ స్టాటిక్ సర్వీసులు-పార్శిల్ స్కానర్)	HYB-MSS-24	కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద పార్శిల్ స్కానర్ యొక్క స్థాపన, నిర్వహణ మరియు ఆపరేషన్	30.11.24	11.00	12.50
10	ADVT-EFF-SI-MMTS-24-1 (ప్రకటనలు-రైలు వెలుపలి వైపున) (పూర్తి ముఖభాగం)	HYB-CP MA-36	హైదరాబాద్ డివిజన్‌లోని ఎంఎంటిఎస్ రైళ్ళ యొక్క వెలుపలి భాగంపై ప్రకటన హక్కులు	29.11.24	12.00	12.30
11	ADVT-EFF-95527-24-1 (ప్రకటనలు-రైలు వెలుపలి వైపున) (పూర్తి ముఖభాగం)	HYB-CP-MA-36	హైదరాబాద్ డివిజన్‌లోని 12797/12798 KCG-CTO-KCG వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు యొక్క వెలుపలి భాగంపై ప్రకటన హక్కులు	29.11.24	12.00	12.40

A1506 సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్.
PUB/1176

అంబర్- రెసోజెట్ 250 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): పలు దిగ్గజ కంపెనీలకు ఎలక్ట్రానిక్ వస్తువులు, విడిభాగాలు అందించే 'అంబర్ - రెసోజెట్' రాష్ట్రంలో రూ.250 కోట్ల పెట్టుబడులతో ఉత్పాదన ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి సోమవారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలుసుకొని ఈ పెట్టుబడి ప్రతిపాదనను వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ..రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు, అలాగే అంబర్-రెసోజెట్ సంస్థకు కూడా ప్రభుత్వపరంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. వచ్చే మూడేండ్లలో రూ.250 కోట్ల పెట్టుబడితో ప్లాంట్‌ను నెలకొల్పడంతో ప్రత్యక్షంగా వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉత్పత్తి యూనిట్లు ఉన్న అంబర్ తాజాగా హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంచుకున్నదని, ఇక్కడ త్వరలోనే అత్యాధునిక పీసీబీ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నదన్నారు.

టీ - హబ్‌లో 3టీ ప్రోగ్రాం

కొండాపూర్, నవంబర్ 25 : యువతలో స్కిల్, సృజనాత్మకతను పెంపొందించడంతోపాటు దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధి కోసం అండగా నిలిచేందుకుగాను టీ హబ్ ప్రత్యేకంగా 3టీ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నది. ఈ ప్రోగ్రాం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన బ్రోచర్లను ఆవిష్కరించారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్‌తో పాటు ఉపాధి, ఆర్థికాభివృద్ధిలో అండగా నిలుస్తున్న 3టీ ప్రోగ్రాంను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా 10వేల మంది యువతకు శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా కొనసాగుతుందని ఈవోల్ స్కిల్ సీఈవో సొమ్యరావు అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో నథింగ్ సర్వీస్ సెంటర్

హైదరాబాద్, నవంబర్ 25: లండన్‌కు చెందిన కన్స్యూమర్ టెక్ బ్రాండ్ నథింగ్ ఇండియా..తాజాగా హైదరాబాద్‌తో నూతన ఎక్సిక్లూజివ్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ మార్కెటింగ్ హెడ్ ప్రణవ్ రావు మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా సర్వీస్ నెట్‌వర్క్‌ను విస్తరించాలనే ఉద్దేశంతో హైదరాబాద్, చెన్నైలలో సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. త్వరలో ముంబై, ఢిల్లీ, బెంగళూరులో కూడా విస్తరిస్తున్నట్లు తెలిపారు.

జనంలోకి వెళ్లేదెలా?

- ఏడాది పాలనపై కాంగ్రెస్‌లో అంతర్మథనం
- ప్రజలకిచ్చిన ఒక్కహామీ నెరవేరని వైనం
- కాంగ్రెస్ ఖాతాలో చెప్పకునేందుకు
- ఒక్క సంక్షేమ పథకమూ లేదని ఆవేదన

హైదరాబాద్, నవంబర్ 25, (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు, 24 గంటల ఉచిత విద్యుత్తు, రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు చేపట్టి ముఖ్యమంత్రిగా కేసీఆర్ తనదైన ముద్ర వేసుకున్నారు. కానీ, కాంగ్రెస్ ఏడాది పాలనలో చెప్పుకునేందుకు ఒక్క సంక్షేమ పథకమూ లేదు. పైపెచ్చు మూసీ కూల్చివేతలు, లగచర్ల గిరిజనుల భూములు గుంజుకోవడం వంటి ఘటనలతో ప్రజల్లో పార్టీ ప్రతిష్ఠ మసకబారింది. ఈ నేపథ్యంలో ఏ ముఖం పెట్టుకుని ఏడాది సంబరాలంటూ ప్రజల్లోకి వెళ్లాలన్న అంతర్మథనం కాంగ్రెస్ నేతల్లో మొదలైంది. డిసెంబర్ 7 నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి ఏడాది అవుతుంది. 9న సోనియాగాంధీ బర్త్‌డే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఏడాది పాలన సంబురాలు, సోనియా పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేసిన ఖర్చు తదితర సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టు తయారు చేయాలని, విపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చేలా రిపోర్టు సిద్ధం చేయాలని ముఖ్య నేత దిశానిర్దేశం చేసినట్టు గాంధీ భవన్ వర్గాలు చెప్తున్నాయి. అయితే, ఆరు గ్యారెంటీల అమలు, జాబ్ క్యాలెండర్, రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మ హాలక్ష్మి, చేయూత, రూ. 4 వేల నిరుద్యోగ భృతి, ఆడబిడ్డకు రూ. లక్షతోపా టు తులం బంగా రం.. వంటి ఏ ఒక్క పథకమూ అమలు కాకపోవడంతో ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లాలంటూ కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారు. ఉత్సవాలను తొలుత రెండు వారాలు నిర్వహించాలనుకున్నా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫిర్యాదుల నేపథ్యంలో వారానికి కుదించినట్టు తెలిసింది. కానీ, కార్యక్రమాల పై ఇప్పటి వరకు ఎలాంటి ఎజెండా లేదని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు.

మహిళలు నిలదీస్తారని

మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా కాంగ్రెస్ ఏదీ అమలు చేయలేకపోయింది. ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 అనే కీలక హామీపై ఎలాంటి ప్రకటనా లేదు. దీనిపై గ్రామల్లో మహిళలు నిలదీస్తే ఏమని సమాధానం చెప్పాలో తెలియక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000, వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఇస్తామన్న హామీ కూడా మూలన పడింది. రైతు భరోసా లేకపోవడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. ఇందిరమ్మ పథకం కింద ఇంటి జాగ, రూ.5 లక్షల హామీతో నియోజకవర్గానికి 3,500 చొ ప్పున రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చింది. విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కా ర్డు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూ లు, పింఛను రూ.4000కు పెంపు వంటి హామీలు కూడా అటకెక్కాయి.

ఏడాదంతా ఢిల్లీ టూర్లకే

పరిపాలనా కేంద్ర బిందువైన సీఎంవో ఇప్పటి వరకు పాలన మీద పట్టు సాధించలేకపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ మీద పూర్తి పట్టున్న ఒక్క బ్యూరోక్రాట్ కూడా సీఎంవోలో లేకపోవడం ప్రధాన లోపమన్న విమర్శలున్నాయి. నేరుగా ముఖ్యమంత్రి ఫోన్ చేస్తే మినహా శాఖాధితులైన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు వినే పరిస్థితి లేదని దక్షిణ తెలంగాణకు చెందిన ఒక ఎమ్మెల్యే తన అనుభవాన్ని పంచుకున్నారు. ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు 28 సార్లు హైదరాబాద్-ఢిల్లీ మధ్య చక్కర్లు కొట్టడానికే ముఖ్య నేతకు సరిపోయిందని, దీంతో పాలనపై పట్టు సాధించలేకపోయారని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లాలో అర్థం కావడం లేదని కాంగ్రెస్ నేతలు వాపోతున్నారు.

మభ్యపెట్టడం అసాధ్యం

రుణ మాఫీ రివర్స్ కావడంపై కాంగ్రెస్ నేత లు ఆందోళనతో ఉన్నారు. ఇంకా 22 లక్షల మంది రైతులకు మాఫీ కావాల్సి ఉండగా వా రికి ఎప్పటిలోగా చేస్తారన్న దానిపై స్పష్టత లే దు. ఇది పూర్తిగా అమలైతే ప్రజల్లోకి వెళ్లేవారమని, కానీ ఇప్పుడు రైతులకు ముఖం చూపిం చే పరిస్థితి లేదని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ కూడా ఎటూ కాకుండా పోయింది. బీఆర్ఎస్ హయాంలో వేసిన నోటిఫికేషన్లకు ఇప్పుడు నియామక పత్రాలు ఇచ్చి తామే ఇచ్చుకుంటున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా నమ్మేందుకు ఎవరూ సిద్ధంగా లేరు. ఇలా అన్నింటా విఫలమైన తర్వాత ప్రజలను ఇంకా మభ్యపెట్టడం అసాధ్యమని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు.

అప్పులు తెచ్చి కమీషన్లకు ఇచ్చి

తమ నేత 11 నెలల కాలంలోనే ఏకంగా రూ 87 వేల కోట్ల అప్పు చేశాడని, డిసెంబర్ 7న ప్రమాణ స్వీకారం చేసిన ఆయన సరిగ్గా 5 రోజులకు అంటే డిసెంబర్ 12న రూ. 1000 కోట్ల అప్పు తెచ్చారని, ఇందులోంచి రూపాయి కూడా సంక్షేమ పథకానికి వినియోగించలేదని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖజానాలో నిల్వ ఉన్న డబ్బును, అప్పుగా తెచ్చిన డబ్బును మొత్తం కలిపి, ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఖర్చుపెట్టిన ప్రభుత్వంలోని ఓ కీలక నేతకు కాంట్రాక్టు బిల్లు బకాయిల కింద చెల్లించినట్టు గాంధీ భవన్ వర్గాలే చెప్పుకుంటున్నాయి. అప్పటి నుంచి ప్రతి నెలా బాండ్లు తాకట్టు పెట్టో, కార్పొరేషన్లను తనఖా పెట్టో వేల కోట్లు అప్పులు చేస్తున్నారని, కనీసం ఈ డబ్బునైనా సంక్షేమ పథకాలకు వినియోగించి ఉంటే, రైతులు, మహిళలు బాగుపడేవారని అంటున్నారు.

స్కూల్ బస్సులపై నిరంతర నిఘా

- అధికారులకు మంత్రి పొన్నం ఆదేశం
- త్వరలో రవాణాశాఖకు కొత్త లోగో

హైదరాబాద్,నవంబర్25(నమస్తే తెలంగాణ): స్కూల్ బస్సులపై నిరంతరం నిఘా ఉంచి, తనిఖీలు చేయాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీవో అధికారులను ఆదేశించారు. 15 ఏండ్లు దాటిన స్కూల్ బస్సులను సీజ్ చేయాలని పేర్కొన్నారు. సోమవారం సచివాలయంలో రవాణాశాఖ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25వేల స్కూల్ బస్సులపై నివేదిక ఇవ్వాలని కోరారు. రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రతి పాఠశాలలో సీఎస్ఆర్ నిధులతో ట్రాఫిక్ అవగాహన పార్కులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రవాణాశాఖకు ప్రత్యేక లోగో రాబోతుందని వెల్లడించారు. ప్రజా విజయోత్సవాల్లో దానిని ఆవిష్కరించనున్నట్టు పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీల పాలకవర్గం

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): యాదాద్రి జిల్లాలోని మోత్కూరు, సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, భద్రాద్రి జిల్లాలోని దమ్మపేట మార్కెట్ కమిటీలకు నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు 128 మార్కెట్ కమిటీలకు పాలకవర్గాల నియామకం పూర్తయ్యింది.

'విద్వేషాలు ప్రమాదకరం'

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తేతెలంగాణ): మత విద్వేషాల వల్ల హైదరాబాద్ నగర భవిష్యత్ ప్రమాదకరంగా మారుతున్నదని పలువురు వక్తలు తెలిపారు. 'మతోన్మాద శక్తుల నుంచి హైదరాబాద్‌ను కాపాడుకుందాం' అనే అంశంపై సోమవారం సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన సదస్సు జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ నిరుద్యోగం, ధరల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే కొన్ని పార్టీలు మత రాజకీయాలు చేస్తున్నాయని చెప్పారు.

కామారెడ్డి డెయిరీ కాలేజీకి దొడ్ల డెయిరీ 4 కోట్ల విరాళం

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): పీవీ నరసింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కాలేజీ అభివృద్ధికి దొడ్ల డెయిరీ యాజమాన్యం రూ.4 కోట్ల విరాళం ప్రకటించింది. ఈమేరకు దొడ్ల డెయిరీ బోర్డు ఆమోద పత్రాన్ని సోమవారం సంస్థ సీఈవో బీవీకే రెడ్డి విశ్వవిద్యాలయ వీసీ, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రత్యేక కార్యదర్శి సబ్యసాచిఘోష్‌కు అందజేశారు. రూ.4 కోట్లతో కళాశాల భవన మొదటి అంతస్తు నిర్మాణం, ఎన్‌హెచ్ 44 నుంచి కళాశాల వరకు సీసీ రోడ్డు, వసతి గృహాల దాకా సీసీ రోడ్డు, భవనాలకు మరమ్మతులు, ప్రాంగణం సుందరీకరణ, మినీ డెయిరీ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని బీవీకే రెడ్డి తెలిపారు.

మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుకు కారణాలను ఇప్పుడే చెప్పలేం

- పరీక్షలన్నీ పూర్తయ్యాకే స్పష్టత వచ్చే అవకాశం
- కాళేశ్వరం కమిషన్‌కు తెలిపిన ఏఈఈ, డీఈఈలు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ బరాజ్‌లోని పిల్లర్ కుంగుబాటుకు కారణాలను ఇప్పుడే చెప్పలేమని ప్రాజెక్టు నిర్మాణంలో భాగస్వాములైన ఏఈఈలు, డీఈఈలు స్పష్టం చేశారు. భూగర్భ పరీక్షలతోపాటు ఇతర పరీక్షలన్నీ పూర్తయ్యాక స్పష్టత వస్తుందని జస్టిస్ ఘోష్ కమిషన్‌కు తెలిపారు. ప్రాజెక్టుపై విచారణ కమిషన్ సోమవారం బీఆర్కే భవన్‌లో విచారణ కొనసాగించింది. ఆ మూడు బరాజ్‌ల నిర్మాణంలో పాల్గొన్న దాదాపు 18 మంది ఏఈఈలు, డీఈఈలను జస్టిస్ ఘోష్ వివిధ అంశాలపై ప్రశ్నించారు. వర్క్ ప్లేస్‌మెంట్ రిజిస్టర్లు, ఎంబీ రికార్డుల్లోని వివరాలపై ఆరా తీశారు. క్వాలిటీ కంట్రోల్ పరీక్షల్లో లోపాలేమైన గుర్తించారా? అని ప్రశ్నించగా.. అలాంటిదేమీ లేదని, అన్నీ సజావుగానే కొనసాగాయని ఇంజినీర్లు వివరించారు. అనంతరం జస్టిస్ ఘోష్ మేడిగడ్డ 7వ బ్లాక్‌తోపాటు మూడు బరాజ్‌ల వర్క్ ప్లేస్‌మెంట్ రిజిస్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వాటిపై ఇంజినీర్ల సంతకాలు తీసుకున్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ మంగళవారం కూడా కొనసాగనున్నది.

'సీతారామ'ను వేగవంతం చేయాలి

- ప్రాజెక్టుల్లో పూడికతీత పనులు చేపట్టాలి
- భూసేకరణపై ఆర్అర్ కమిషనర్‌తో చర్చించాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): సీతారామ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని, ఆ ప్రాజెక్టు పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన ఇరిగేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివధ ప్రాజెక్టుల పురోగతి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులకు పాలనాపరమైన అనుమతులు తీసుకోవాలని, మోదీకుంట వాగు, చిన్నకాళేశ్వరం తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశాలపై ఆర్అర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో చర్చించాలని సూచించారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. సింగూరు ప్రాజెక్ట్‌పై నవంబర్ 27న ప్రత్యేక సమీక్షా సమావేశం ఉంటుందని తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో సీఎం రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లాలో పర్యటిస్తారని, ఆ పర్యటన సందర్భంగా ఆ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్షిస్తారని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యాదాస్ నాథ్, ఈఎన్సీ అనిల్ కుమార్, ఈఎన్సీ ఓఅండ్ఎం నాగేందర్‌రావు, చీఫ్ ఇంజినీర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.